# సామాన్యుడి సేవలో రిజర్వ్ బ్యాంకు

## మిత్రులారా!

కారంచేడు గ్రామానికి మళ్ళీ నలభై ఏళ్ళ తరవాత రావడం నాకెంతో ఆనందంగా ఉంది. 1967లో ఈ గ్రామానికి ఎన్నోసార్లు వచ్చాను. ఒక సందర్భంలో పెళ్ళికి హాజరవ్వాలని వచ్చాను. అప్పుడు నేను ఒంగోలులో సబ్ కలెక్టర్‌గా, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్‌గా పనిచేస్తుండేవాడిని. 1969లో గుంటూరు జిల్లా కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ ఇన్‌చార్జిగా ఉన్నప్పుడు మరోసారి లఘు సందర్శనగా ఈ గ్రామానికి వచ్చాను. స్వాతంత్ర్యసమరయోధులు, శాస్త్రజ్ఞులు, కవులు, నౌకావాణిజ్యవేత్తలు, మంత్రులు, వైద్యులు మొ॥ వివిధ రంగాలకు చెందిన విశిష్ట వ్యక్తులెందరో ఈ ఊరినుంచే వచ్చారు. వారిలో ప్రముఖ వ్యక్తిత్వం ఉన్నవారు సుశిక్షితులయిన ఇంజనీరు శ్రీయార్లగడ్డ రంగనాయకులు గారొకరు. మేమిద్దరం హైదరాబాదులో 30 ఏళ్ళ క్రితం యాదృచ్ఛికంగా కలుసుకొన్నాం. స్నేహితులుగా మారి ఎన్నో రంగాల్లో సామాజికంగా ఉపయోగపడే పనులు చేసి హైదరాబాదు స్టడీ సర్కిల్‌ను స్థాపించడంలో విజయం సాధించాం. కాబట్టి నాకు ఆయన పట్ల వ్యక్తిగత అభిమానం ఉంది. మా కుటుంబాల మధ్య ఆత్మీయతాభిమానాలు పెనవేసుకొన్నాయి. కుటుంబాల మధ్య ఉన్న బంధాలు ఎంతగా విస్తరించి పోయాయంటే - ఉదాహరణకు డా. వై.పి.సి.ఎస్.రావుగారు, శ్రీలక్ష్మీనారాయణగారు కూడా మా బంధంలో చేరారు. నీ స్నేహితుడైన శ్రీరంగనాయకులుగారి జ్ఞాపకార్థం సామాజికంగా దోహదపడమని నన్ను ఆయన కుటుంబసభ్యులు కోరినప్పుడు, నన్ను ఎంతో గౌరవించినట్లుగా భావించాను. మీ మధ్య, ఈ గ్రామంలో ఉండటం ప్రత్యేక ప్రయోజనం పొందినట్లుంది. గ్రామప్రాంతాభివృద్ధి, ప్రత్యేకించి రక్షిత మంచనీటి పథకం కోసం అంకితమయిన ట్రస్టు ఏర్పడటం యువతరానికి అనుసరణీయమైన ప్రశస్త ప్రయోజనమే. యార్లగడ్డ రంగనాయకులుతరం స్థాపించిన పునాదుల ఫలాలనే ఈనాడు యువతరం అనుభవిస్తోంది.

ఇష్టాగోష్ఠిగా చెప్పాలంటే నేను ఈ సందర్భంలో ''సామాన్యుడి సేవలో రిజర్వ్ బ్యాంకు'' అన్న సముచిత అంశం గురించి కొన్ని మాటలు మాట్లాడదలిచాను.

భారతీయ రిజర్వ్‌బ్యాంకు ప్రభుత్వ సంస్థగా ప్రజాప్రయోజనాలను నెరవేరుస్తోంది. పేరులో 'బ్యాంకు' అన్న పదం ఉన్నప్పటికీ లాభం అన్నది ప్రాథమిక లక్ష్యం కాదు. కాబట్టి సామాన్యులైన ప్రతి ఒక్కరూ ప్రజాబాహుళ్య సంక్షేమ కోసం ఈ సంస్థ పాత్రనూ నెరవేర్చే ప్రయోజనాలను అర్థంచేసుకోవాలి.

రిజర్వుబ్యాంకు దేశంలో 'కేంద్రబ్యాంకు'గా విశిష్టంగా స్థాపితమై కొన్ని నిర్దిష్ట, సవాలు చేసే ప్రజాబాధ్యతలను నెరవేరుస్తోంది. దేశానికిది ద్రవ్యాధికార సంస్థగా ఉంది. రూపాయి మనదేశంలో చెలామణిలో ఉండే కరెన్సీయూనిట్ అనిమీకు తెలుసు. దేశంలో ఆదర్శంగా లభించే రూపాయి వనరుల పరిమాణాన్ని రిజర్వ్‌బ్యాంకు నిర్వహిస్తుంది. దీని ద్వారా దేశంలో ఆర్థికవృద్ధి ప్రోత్సాహం, సరుకుల సేవల లావాదేవీలు సులువుగా జరుగుతాయి. అధిక మొత్తంలో ద్రవ్య సరఫరా జరిగితే ద్రవ్యోల్బణం లేదా అధిక ధరలు సంభవిస్తాయి. ఇవన్నీ సామాన్యుడి మీద ప్రభావం చూపుతాయి. మరోవంక చాలినంత ద్రవ్యవనరులు లేకపోవడం వల్ల పెరుగుదల ప్రభావితమై, చెల్లింపు వ్యవస్థ కుంటుపడుతుంది. రిజర్వ్‌బ్యాంకు తన విధానాల ద్వారా సముచిత సమతూకం ఏర్పడేలా చూస్తుంది.

కరెన్సీ యాజమాన్యం మరో ప్రధానమైన ప్రయోజనం. ఉదాహరణకు -రిజర్వుబ్యాంకు కొత్తనోట్లు జారీచేస్తుంది. పాతనోట్లను వెనక్కుతీసుకొని, చెలామణీలో లేకుండా చేసి, నశింపజేస్తుంది. దేశంలోని అన్ని ప్రాంతాలలో చెలామణికి వీలుగా కొత్తనోట్ల నమూనా, ఉత్పత్తి, పంపిణీని నిర్వహిస్తుంది.

కరెన్సీ నోటుమీద గ్రహీతకు సొమ్మును చెల్లిస్తానని వాగ్దానం చేస్తున్నాను. (I promise to pay the bearer a sum of...) అని ఉంటాయి. దానికింద గవర్నర్ సంతకం ఉంటుంది. కాబట్టి రిజర్వ్‌బ్యాంకు రూపాయి విలువను నిలువరించి ఉంచాలి. అప్పుడే ప్రజల్లో ఈ సంస్థ పట్ల ఎల్లకాలం విధేయత, నమ్మకం ఉంటాయి. రూపాయి విలువను నిలువరించాలంటే రూపాయి ద్వారాల నుంచే సరుకుల, సేవల మొత్తంలో కోత జరగకూడదు. ఒకవేళ అట్లా జరిగితే కరెన్సీలో విశ్వాసం నశిస్తుంది. కాబట్టి ధరల స్థిరత్వానికి పాటుపడి ద్రవ్యోల్బణాన్ని నిరోధించి ద్రవ్యోల్బణం పెరుగుదలకు లంగరేయడం రిజర్వ్‌బ్యాంకు ప్రధాన లక్ష్యం.

అనుషంగికంగా గమనించినట్లయితే కరెన్సీ నోటు మీద వర్గ సంకేతం - సంఖ్య రెండు కేంద్ర ప్రభుత్వ అధికారభాషల లోనూ (ఇంగ్లీషు, హిందీలలో) 15 జాతీయ భాషలలోనూ, రాసి ఉంటుంది. ఇది దేశంలోని భిన్నత్వాన్ని రిజర్వ్‌బ్యాంకుకు జాతిపట్ల ఉండే నిబద్ధతతను తెలుపుతుంది.

డబ్బు విలువ గురించి చెప్పాల్సి వస్తే మనదేశంలో విలువ గురించే కాకుండా, ఇతరదేశాలలో చలామణీలో ఉండే కరెన్సీలకు సంబంధించి మన రూపాయి విలువను రిజర్వ్‌బ్యాంకు పట్టించుకొంటుంది. అంటే మన కరెన్సీకి విదేశాల్లో కూడా విశ్వాసాన్ని ఆపాదించి ప్రజల మన్ననలను పొందుతుంది. ఇదంతా వినిమయ రేటు నిర్వహణ కోవకు చెందుతుంది. విదేశాల లావాదేవీలలో రూపాయిని ప్రత్యక్షంగా ఉపయోగించే

అవకాశం ఉండదు. అంతర్జాతీయ ద్రవ్యాలయిన అమెరికన్ డాలర్ వంటివి ఉపయోగిస్తారు. అంతర్జాతీయ లావాదేవీలు మృదువుగా సాగడానికి రూపాయి బాహ్యస్థిరత్వం కుదురుగా వుండటం అవసరం. దేశీయ ధరల స్థిరత్వం మీదకూడా విదేశాల్లో రూపాయి మీద విశ్వాసం ఆధారపడి ఉంటుంది. ఈ విశ్వాసం నిలకడగా ఉంచి నిర్ధారించేందుకు రిజర్వ్‌బ్యాంకు విదేశీ మారకాన్ని నిర్వహించి, యాజమాన్యం చేస్తుంటుంది.

ప్రజలు డబ్బును వారిలో వారు అప్పు ఇవ్వడం, తీసుకోవడం ద్వారా మొత్తంమీద వినియోగం, ఉత్పత్తికి ఉపయోగిస్తారు. వనరుల డిమాండ్, సరఫరాకు సరాసరి షరతులతో సముచిత స్థాయిలో వడ్డీరేట్లను సమతూకం చేయాల్సి ఉంటుంది. అట్లా చేయడం ద్వారా ఆదా చేసేవారికి ప్రోత్సాహకాలు లభిస్తాయి. అలాగే పరిశ్రమలు, వ్యవసాయం మొ॥ రంగాల్లో పెట్టుబడి పెట్టిన వారికి చాలినంత ఆదాయం లభిస్తుంది. రిజర్వ్‌బ్యాంకు అనుకరించని వడ్డీరేటు విధానాల వల్ల సమతూకం నిలిచి ఉంది. ఈ విధానాన్ని మరింత సులభీకరించి మనదేశంలోనూ, ఇతరదేశాలతోనూ విస్తృత సమతూకం ఉండేలా చేయాలన్నది నా ఆలోచన.

రిజర్వ్‌బ్యాంకుకు ఎన్నో ఇతర బాధ్యతలు కేటాయించబడి ఉన్నాయి. ఆవిధంగా కేంద్రప్రభుత్వ, అన్ని రాష్ట్ర ప్రభుత్వాల ప్రజారుణాలను నిర్వహిస్తుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు బ్యాంకరుగా ఉండి వారి ఖాతాలను నిర్వహిస్తుంది. చెల్లింపులను, సర్దుబాటు విధానాలను క్రమబద్ధీకరిస్తుంది. మీలో కొంతమందికి ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండేలా బ్యాంకింగ్ వ్యవస్థను క్రమబద్ధ కారకంగా వ్యవహరిస్తుంది.

నేను ఇదంతా వివరిస్తూ అధిక సమయం తీసుకోను. వీటన్నింటికీ సంబంధించి సమాచారాన్నంతా ప్రజలకు అందుబాటులో ఉండేలా - ప్రచురణలు, ప్రెస్ సమాచారం, కొన్ని సందర్భాల్లో ఉపన్యాసాలుగా విడుదల చేశాం. రిజర్వ్‌బ్యాంకుకు సంబంధించిన వెబ్‌సైట్‌లో ఇంగ్లీషు, హిందీ భాషల్లో నేటిదాకా లభించే సమాచారం అందుబాటులో ఉంచాం. మాపని గురించి, కార్యకలాపాల గురించి మీకు ఎందుకు వివరించాలి? రిజర్వ్‌బ్యాంకు ప్రజాసంస్థ కాబట్టి ఇవన్నీ మీకు వివరించాల్సిన బాధ్యత ఉంది. మీరు అవగాహన చేసుకొని ప్రశంసలు, విమర్శలు కురిపించి మార్గదర్శకత్వం చేస్తారని భావిస్తున్నాను. ఇది ప్రచార ఉద్యమం కాదు. దీనిద్వారా మేము సామర్థ్యం పెంచుకొని ప్రజలకు సేవలందించి పూచీ వహించాలన్నది మా భావన.

రిజర్వ్‌బ్యాంకు ప్రజాసంస్థగా ప్రభుత్వానికి, ప్రజానీకానికి ఏవిధంగా సమాధానం ఇవ్వాల్సి వస్తుందో వివరించే కొన్ని సందర్భాలు నేను ఈ రోజు పేర్కొంటాను.

అంతేకాకుండా ఇటీవలి కాలంలో సామాన్యుడికి దగ్గరయ్యేందుకు తీసుకొన్న చర్యలను వివరిస్తాను.

సామాన్యుల బ్యాంకింగ్, ఆర్థికావసరాలకు అనుగుణంగా స్పందించమని బ్యాంకులకు విన్నవించాం. ఆర్థికచేరిక ఉండేలా విధానాన్ని అనుసరించమని కోరాం. అందువల్ల ప్రతి కుటుంబం - సంపన్నులయినా, పేదవారయిన, గ్రామీణులయినా, నగరవాసులయినా అందరూ- బ్యాంకింగ్ ఒడిలోకి వచ్చేస్తుంది. చిన్నఓవర్ డ్రాఫ్ట్ వసతితో 'నోఫ్రిల్స్' ఖాతాలను తెరవడం ఆర్థిక చేరికకు సులభమయిన మార్గం. ఆధునిక సాంకేతిక విధానాలను అనుసరించడం ద్వారా ప్రజలకు బ్యాంకింగ్ ఏవిధంగా అధికంగా అందుబాటులోనికి వస్తుందనేది పరిశీలిస్తున్నాం. రుణాలు తీసుకోవాలనుకున్నా లేదా లావాదేవీలు జరపాలనుకొన్నా ప్రతిసారీ ఎక్కువగా కాగితంతో పనులు లేకుండా రైతులకు సాధారణ, కిసాన్ క్రెడిట్‌కార్డులను అందించి వాటి ద్వారా చిన్న తరహా పరపతి సౌకర్యం కల్పించాం. ప్రత్యామ్నాయాలను కల్పించేదిశగా గ్రామీణ ప్రాంతాల్లో బ్యాంకింగ్ వసతులను తపాలా కార్యాలయాల ద్వారా కల్పిస్తున్నాం. బ్యాంకుల ఉపగ్రహ కార్యాలయాలను, ఎటిఎమ్ (నిరంతర ధన సరఫరా యంత్ర కేంద్రాలు) లను నెలకొల్పాం. నగర ప్రాంతాల్లో ప్రతినిమిష నిమిషానికి సత్వరమే వ్యయ సామర్థ్య నిధుల బదిలీ - ఒక ఖాతానుంచి మరొక ఖాతాకు జరిగేలా ఎలక్ట్రానిక్ బదిలీ యంత్రాంగాన్ని సంచార (మొబైల్) ఇంటర్నెట్ బ్యాంకింగ్ ఏర్పాటు చేసేందుకు యత్నిస్తున్నాం. రోజువారీ లావాదేవీలకు - బిల్లులు, చెల్లింపులు, వేతన డివిడెండ్లు, పింఛన్ గ్రహింపులు, ప్రత్యక్షంగా ప్రయోజనదార్ల బ్యాంకు ఖాతాలకు చెందేటట్లుగా విశ్వసనీయ, ఖచ్చితమైన, పొదుపైన మార్గాలను ప్రోత్సహిస్తున్నాం.

హేతుబద్ధమైన వ్యయంతో మంచినాణ్యత ఉండే బ్యాంకింగ్ సేవల కల్పనకు ఎన్నోచర్యలను తీసుకొంటున్నాం. ఎంత వ్యయంతో వినియోగదార్లకు ఎటువంటి సేవలు అందించాలన్నది బ్యాంకులకు తెలుసును కనుక ప్రతిబ్యాంకు వినియోగదారుకు అందించే నాణ్యతాపరమైన సేవకు కొలబద్ధ ప్రమాణాన్ని లేదా బెంచ్ మార్క్‌ను సూచించుకోమని నిర్దేశించాం. దీనికిగాను రిజర్వ్‌బ్యాంకు ఒక సంస్థను బ్యాంకింగ్ నియమావళి, భారతీయ ప్రమాణాల మండలి (బి.సి.ఎస్.బి.ఐ) పేరిట నెలకొల్పి బ్యాంకులు చేసిన వాగ్దానాలకు అందించే నాణ్యత సేవలను అంచనవేయిస్తోంది. ఈ మండలి చేసే ప్రతికూలరిమార్కులను గమనించి సరిచేసే చర్యలు తీసుకొంటుంది. బ్యాంకింగ్ సంబంధాలు మెరుగుపరిచే ఉద్దేశంతో బ్యాంకులను వారి ఖాతాదారులకు సమాచారాన్ని అందుబాటులో ఉంచి వివిధ బ్యాంకింగ్ సేవలకు విధించే వ్యయం గురించి తెలియజేయమని కోరాం. బ్యాంకు చేసే సేవా వాగ్దానాలను నెరవేర్చమని కోరడం, డిమాండ్ చేయడం మీకుండే హక్కు.

బ్యాంకులు వాగ్దానం చేసిన సేవలను అందించకపోతే మీరు వారి గురించి ఫిర్యాదులు చేయవచ్చు. మొట్టమొదట బ్యాంకు సంబంధిత పై అధికారులకు తెలియజేయవచ్చు. మీ సంతృప్తి మేరకు తగినంత సమయంలో ఫిర్యాదు పరిష్కారం కాకపోతే మీరు బ్యాంకింగ్ తగవరిని (అంబుడ్స్‌మన్) కలుసుకోవచ్చు. ఫిర్యాదు చేసుకోవచ్చు. బ్యాంకింగ్ తగాదాల పరిష్కారానికి బ్యాంకు వినియోగదారుల కోసం రిజర్వ్‌బ్యాంకు తేలికైన, తక్కువ వ్యయం అయ్యే బ్యాంకింగ్ తగవరి ఉండి ఫిర్యాదులు పరిష్కరిస్తుంటాడు. తపాల ద్వారా లేదా ఇంటర్నెట్ ద్వారా మీ బ్యాంకు ఫిర్యాదులను పంపి పరిష్కారం చేసుకోవచ్చు.

రిజర్వ్‌బ్యాంకు స్వప్రక్రియను మెరుగుపరచుకొనే విధానాన్ని కూడా అవలంబిస్తోంది. ప్రధాన, ప్రత్యక్ష వినియోగదారులయిన ప్రభుత్వాలకు, బ్యాంకులకు కేంద్రబ్యాంకు ద్వారా మంచి సేవలను అందిస్తోంది. రిజర్వ్ బ్యాంకులోని రెండు విభాగాలకు ఐ.ఎస్.ఓ ధ్రువీకరణ లభించింది. అంటే ఈ రెండు విభాగాలు సరయిన పద్ధతిలో మెరుగయిన, త్వరిత గతిన వినియోగదారు సేవలందిస్తూ, నిరంతరం యథోచిత స్థితిలో ఉంటున్నాయన్న మాట. ప్రజలతో సంబంధం ఉండే రిజర్వ్ బ్యాంకులోని ఇతర విభాగాలకూ ఈ ధ్రువీకరణ వచ్చేలా యత్నిస్తుంది.

మేము మనఃపూర్వకంగానే ప్రజలను చేరుకొనేవిధానాలను అనుసరిస్తున్నాం. అప్పుడు కానీ వారికి మానుంచి ఏంకావాలో, ఏమి కోరుకోవాలో, బ్యాంకింగ్ సేవలకు సంబంధించి ఏ హక్కులున్నాయో, ఏ విధులు నెరవేర్చాలో తెలుస్తాయి. పరిశోధకులకు విద్యార్థులకు, ఇతర సాంకేతిక నిపుణులకు అందుబాటులో ఎన్నో ప్రచురణలున్నాయి. 2007-08లో సామాన్యుడికి అందుబాటులో రిజర్వ్ బ్యాంకు ఉండాలని ప్రత్యేక చర్యలు చేపట్టాలని తీర్మానించాం. అందుకని వారికి ఆర్థిక విద్య, అక్షరాస్యత కల్పించదలిచాం. బ్యాంకుల ద్వారాను, ప్రత్యక్షంగా మా ద్వారా ఇది కలుగుతుంది. తెలుగులో-ప్రాంతీయ భాషలో నేను మీతో మాట్లాడటం ఈ దిశగా తీసుకొన్న ఉత్తేజిత చర్యే. అతి త్వరలో బ్యాంకింగ్ విధానాలు, పథకాల గురించి తెలుగు భాషలో తెలుసుకొంటారు. ఇతర ప్రాంతాలవారికి వారి వారి స్థానిక భాషల్లో తెలుసుకొనే చర్యలు కూడా చేపడుతున్నాం. ఇందుకు బహుభాషా వెబ్‌సైట్‌ను ఆరంభిస్తున్నాం. అంతేకాకుండా సమాచారాన్ని కరపత్రాలు, ఫిల్ములు, బ్రోచర్లుగా విడుదల చేస్తున్నాం.

రిజర్వ్‌బ్యాంకు ఒక కుటుంబంలా వ్యవహరిస్తుంది. ఈ సంస్థ అత్యుత్తమ ప్రజ్ఞ ఉన్నవారికి సమానావకాశం కల్పించి క్లిష్టమైన సవాళ్ళు ఎదుర్కొనేలా తయారు చేస్తుంది. అన్ని రాష్ట్ర రాజధానుల్లో రిజర్వ్ బ్యాంకు కార్యాలయాలున్నాయి. సంచాలక మండలిలో విభిన్నరంగాలకు చెందిన వారున్నారు. మాతో పనిచేసే వారిలో, మాలో సవాళ్ళను

ఎదుర్కొని సామాన్యుడికి శ్రద్ధతో, నిబద్ధతతో సేవను అందించేందుకు నిరంతరం నైతికత్వాన్ని, ప్రేరణను సంచాలక మండలి కల్పిస్తూంటుంది. మా సంస్థ పత్రికకు ఎన్నో పురస్కారాలు కూడా లభించాయి. ఇప్పటివరకు రిజర్వ్ బ్యాంకు గురించి ఎన్నో విషయాలు మీతో ముచ్చటించాను. కొన్ని విషయాలు-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంతో ఉండే మా సంబంధం గురించి వివరించాలి. వాస్తవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో, రాష్ట్ర ముఖ్యమంత్రులతో అద్భుతమైన సంబంధాలు నెలకొల్పుకొన్న సంప్రదాయం ఆర్.బి.ఐ.కి ఉందని చెప్పాలి. గవర్నర్‌గా ఉండి నేను అప్పటి ముఖ్యమంత్రి శ్రీ ఎన్. చంద్రబాబునాయుడు గారిని కలిశాను. అలాగే ఇప్పుడు అప్పుడప్పుడు శ్రీ వై.ఎస్.రాజశేఖరరెడ్డిగారిని కలుస్తూనే ఉన్నాను. వివిధ అధికారిక స్థాయిలో జరిగే సమావేశాలవల్ల ఇటు రిజర్వ్‌బ్యాంకు, అటు రాష్ట్రం ప్రయోజనాలు పొందుతున్నాయి. రిజర్వ్‌బ్యాంకు కృషిని ప్రత్యేకించి మన్నన పొందిన ఇటీవలి రాష్ట్రాభివృద్ధి కార్యక్రమాల గురించి మీకు వివరిస్తాను.

మొట్టమొదటగా రాష్ట్ర ప్రభుత్వ బ్యాంకరుగా ఒక విషయం చెప్పేందుకు ఎంతో ఆనందిస్తున్నాను. రోజువారీగా రాబడులు, ఖర్చుల మధ్య తలెత్తే లోటును ఎదుర్కొనేందుకు తాత్కాలిక అడ్వాన్సులను రాష్ట్రం మూడేళ్ళనుంచీ తీసుకోవడం లేదనేది చాలా గొప్ప విషయం. ఇది వివేకవంతుమయిన కోశ యాజమాన్యాన్ని సూచిస్తోంది.

రాష్ట్ర ఆర్థిక స్థితి మెరుగుపడుతోందన్నది రెండో సంగతి కాబట్టి రిజర్వ్‌బ్యాంకు ప్రాయికంగా అల్పవ్యయంతోటే ప్రభుత్వ రుణాల్ని అభివృద్ధి ప్రయోజనాలకు నిర్వహిస్తోంది. ఏళ్ళు గడుస్తున్నా కొద్దీ ప్రత్యేకించి కొత్త మిలియమ్‌లో రాష్ట్రంలో ఆర్థిక మార్కెట్లు విశ్వాసం ప్రకటిస్తున్నాయి.

నగర సహకార బ్యాంకింగ్ వ్యవస్థను మెరుగుపరిచి సమగ్రీకరించేందుకు రిజర్వ్‌బ్యాంకుతో అవగాహన ఒప్పందం కుదుర్చుకొన్న మొట్టమొదటి రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అన్నది మూడో విషయం. సహకార స్ఫూర్తిని, వృత్తివాదంతో మేళవించి కొత్త పథకాన్ని అమలుచేసి అద్భుతమైన రీతిలో నిర్వహిస్తోంది.

రాష్ట్రం గ్రామీణ సహకార సంస్థలకు దృఢమైన ఆర్థిక సహాయాన్ని అందిస్తోంది. రిజర్వ్‌బ్యాంకుతో దేశంలో మొట్టమొదటగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రమే అవగాహన ఒప్పందం కుదుర్చుకొని గ్రామీణ సహకార పరపతి విధానాన్ని అభివృద్ధిపరిచి సమగ్రీకరిస్తోంది. ఇందుకు నాకెంతో గర్వంగా ఉంది. ఈ పథకం వల్ల గ్రామీణ సహకార సంస్థలు భారత ప్రభుత్వం నుంచి నిర్దిష్ట ఆర్థిక సహాయం అందుకొని పునరుద్ధరణ పొంది నూతన చైతన్యం నింపుకొంటాయి.

రాష్ట్రం గ్రామీణ పరపతి విస్తరణకు నూతన చైతన్యం నింపేందుకు నిబద్ధమై ఉంది. గతవారం రాష్ట్ర ప్రభుత్వాధికారులతో మా డిప్యుటీ గవర్నర్ సమావేశమయ్యారు. ప్రాంతీయ గ్రామీణ బ్యాంకులను దృఢపరచడం ద్వారా ఆర్థిక చేరికను విస్తృతం చేసే మధ్యకాలిక పథకాన్ని ఆరంభించాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

ప్రధానంగా వ్యవసాయానికి రుణాలను గడచిన మూడేళ్ళలో ద్విగుణీకృతం చేసి గ్రామీణ పరపతిని సాలుసరి పథకంలో జాతీయ స్థాయి లక్ష్యాలను రాష్ట్రం అధిగమించడం ఆరో అంశం.

ఆర్థిక చేరిక ఆరో కార్యక్రమంలో రాష్ట్రం అగ్రగామిగా ఉండడం ఏడో అంశం. అంటే కావాలనుకొన్న అన్ని కుటుంబాలకు బ్యాంకు ఖాతాలను కల్పించడం అన్నమాట. ఇటీవల రిజర్వ్‌బ్యాంకును సందర్శించిన నోబెల్ పురస్కార గ్రహీత ఆచార్య మహ్మద్ యూనస్‌గారు బ్యాంకు పరపతిని మానవ హక్కు లక్ష్యంగా అందించాలని సూచించారు. అందుకని ఈ దిశగా చర్యగా తీసుకొంటున్నాం. ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే 100% ఆర్థిక చేరిక సాధించడం జరిగిందని నివేదికలు వచ్చాయి. నిపుణుల సంఘం ఏర్పరిచి ఎప్పటికప్పుడు ప్రగతి మూల్యాంకనం చేయాలని రాష్ట్ర ప్రభుత్వంతో అంగీకరించాం. అప్పుడే ఈ కార్యక్రమాన్ని మిగిలిన జిల్లాల్లో విస్తరించే ముందు బలాలు, బలహీనతలేమిటో తెలిసి వస్తాయి. విశ్వజనీన ఆర్థిక చేరిక లక్ష్యం పట్ల జాగరూకతతో కఠినంగా శ్రమించాలని బ్యాంకులను ఆదేశించాం. ఈ యత్నాల్లో విజయం సాధించాలంటే రాష్ట్ర ప్రభుత్వ సహకారం కీలకమైన అంశం.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికీ, రిజర్వ్ బ్యాంకు మధ్య సాధించిన సహకారం సరిపోతోందా? అని ప్రశ్నించుకొంటే సరిపోతుందనే చెప్పినా ప్రభుత్వం, బ్యాంకూ కలిసి మెలిసి సాగాల్సిన ఎన్నో రంగాలు ఇంకా మిగిలి ఉన్నాయి. కొత్తరంగాల్లో మరింత గాఢంగా, వేగంగా, నిశితంగా సాగిపోవాలి. ఈ ఏడాది తీవ్రతరం చేయాల్సిన కొన్ని నూతన రంగాలను రిజర్వ్‌బ్యాంకు గుర్తించింది. దానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పూర్తి సహాయం అందిస్తానని హామీ ఇచ్చింది. ఈనాడు సామాన్యుడి దగ్గర కొంత మిగులు సొమ్ము ఉందంటే ఎన్నో అవకాశాలవైపు పరుగులిడుతున్నారు. ఒక్కోసారి ఆ అవకాశాలు ఇబ్బందులకు గురిచేయవచ్చు. డబ్బును ఎక్కడ డిపాజిట్ చేయాలి? ఎంతకాలం, ఎంత వడ్డీకి, మ్యూచ్యువల్ ఫండ్‌ల బ్యాంకు డిపాజిట్లు, జీవిత భీమా బ్యాంకింగేతర డిపాజిట్లు, చిట్‌ఫండ్ల మధ్య ఎటువంటి నిర్ణయం తీసుకోవాలి? కుటుంబ ఆర్థిక హోదా మెరుగుపరిచి, ఏ విధంగా నిలకడగా ఉంచాలి? ఆదాయం కొద్ది మొత్తంలో ఉన్నా ఎట్లా మృదు వినియోగం చేసుకోవాలి? మొ॥ ప్రశ్నలు సామాన్యుడిని చుట్టుముడుతున్నాయి. ప్రజలు అప్రమత్తులుగా ఉండాలి. మిథ్యా వాగ్దానాలకు

లోబడకూడదు. ఆర్థిక కబళింపుదార్ల మాయా ప్రచారానికి లొంగకూడదు. రిజర్వ్‌బ్యాంకు ఈ దిశగా చర్య తీసుకొని దృశ్య సామగ్రిని, లిఖిత సామగ్రిని తయారు చేయిస్తోంది. ఎవరయినా ఈ సామాగ్రిని తయారు చేద్దామనుకుంటే ఆర్థిక సహాయాన్ని అందిస్తుంది. బహుళ ఆర్థిక అక్షరాస్యత ఉద్యమంద్వారానే ఈ అక్షరాస్యతను, విద్యనూ ప్రజలకు అందించగలం. ఈ దిశగా రిజర్వ్‌బ్యాంకుకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చింది.

పరపతి సంప్రదింపు సేవలకు సంబంధించి చిన్న తరహాగా మార్గదర్శక ప్రాతిపదికన యత్నం చేయాలన్నది మరోరంగం. ప్రజలు కొన్నిసార్లు అమాయకంగానో లేదా దురదృష్టవశాత్తూ అప్పులో ఇరుక్కుపోతారు. కనీస బాధలతో వారి అప్పుల్ని, బాధ్యతలను పునర్‌క్రమబద్ధీకరించుకొని, రాజీ చర్చల ద్వారా సమస్యల నుంచి బయటపడవచ్చు. ఇందుకుగాను ప్రజలకు సలహాలిచ్చేందుకు సుశిక్షితులైనవారు ఉండాలి. ఇటువంటి పథకాలు విదేశాల్లో ఉన్నాయి. మేం వాటిని అధ్యయనం చేశాం. చిన్నతరహాగా ఈ దిశలో మహారాష్ట్రలో ప్రయోగంచేస్తున్నాం. మార్గదర్శక ప్రాజెక్టులుగా ఇతర ప్రాంతాల్లో ఆరంభిస్తున్నాం. మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ కార్యక్రమంపట్ల ప్రత్యేక ఆసక్తి కనబరుస్తోంది. కాబట్టి పరపతి సంప్రదింపు సేవలోనూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశం మొత్తంలోనే ప్రథమంగా నిలిచి ఒప్పందం చేసుకొని ఆదర్శంగా నిలుస్తుందని భావిస్తున్నాను.

ఈ మాటలతో, నా మాతృభాష అయిన తెలుగులో మాట్లాడేందుకు, గవర్నర్‌గా మొట్టమొదటి సారిగా ఈ వేదికమీద అవకాశాశాన్నచ్చినందుకు ధన్యవాదాలు తెలుపుతున్నాను. గవర్నర్‌గా తెలుగులో మాట్లాడిన మొదటి ఉపన్యాసం ఇదేనేమో! ఈ అవకాశం వినియోగించుకొన్నందుకు, ప్రత్యేక ప్రయోజనం పొందినందుకు ఎంతో సంతోషంగా ఉంది.

ఈ గ్రామానికి, ట్రస్టుకీ శుభాకాంక్షలు. అద్భుతమైన ఉత్తేజం కనబరిచిన శ్రీ యార్లగడ్డ రంగనాయకులు ఫౌండేషన్‌కు అభినందనలు. వారి కుటుంబానికి శుభాభినందనలు. వారు చేస్తున్న ఉత్తమ ప్రయత్నాలు సఫలం కావాలని నా ఆకాంక్ష.